తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం-26- నవంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 179 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# మోగిన స్థానిక ఎన్నికల నగారా

- పంచాయితీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- 3 విడతల్లో పంచాయితీ ఎన్నికలు
- డిసెంబర్ 11,14,17 తేదీల్లో పోలింగ్






**హైదరాబాద్,నవంబర్25(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల అయింది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ చీఫ్ రాణి కుమిదిని మంగళవారం సాయంత్రం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'తెలంగాణలో కోటి 66 లక్షలకు పైగా గ్రామీణ ఓటర్లు ఉన్నారు. సెప్టెంబర్ 29వ తేదీన అనౌన్స్ చేసిన షెడ్యూల్‌ను కొన్ని కారణాల వల్ల నిలిపివేశాము.మంగళవారం నుంచి ఎంసీసీ కోడ్ అమలులోకి వస్తుంది. అబ్జర్వర్‌లు, ఎలక్షన్ అబ్జర్వల్‌లను నియమించాం. 31 జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు జరుగుతాయి. డిసెంబర్ 11,14,17 తేదీల్లో పోలింగ్ జరుగుతుంది. ఓట్ల లెక్కింపు పోలింగ్ రోజే ఉంటుంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. నవంబర్ 27వ తేదీ నుంచి తొలి విడత పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్లు స్వీకరిస్తారు. రెండో విడత ఎన్నికలకు ఈ నెల 30వ తేదీ నుంచి, మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు' అని తెలిపారు.




# నూతన 'లేబర్ కోడ్'లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయవద్దు

**టియుడబ్ల్యుజె రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం**

**హైదరాబాద్,నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ప్రభుత్వం అమలులోనికి తీసుకొచ్చిన నూతన 'లేబర్ కోడ్'లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేయాలని టియుడబ్ల్యుజెఐజెయు, కేంద్ర కార్మిక సంఘాలు తీర్మానించాయి. నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ధర్నాలతో పాటు ఇందిరాపార్క్ వద్ద 'కార్మికుల తలపెట్టనున్న నిరసన గళం' కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యుజె) అధ్యక్షుడు కె.విరాహత్ అలీ అధ్యక్షతన బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.

మిగతా 2లో

# హైదరాబాద్‌ను అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,నవంబర్25 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా నిలిపే వేదికగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా ప్రభుత్వం అందించే సౌకర్యాలు, అవకాశాలు, విధానాలను సమ్మిట్‌లో సమగ్రంగా వివరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. డిసెంబరు ఎనిమిది, తొమ్మిదో తేదీల్లో భారత్ భవిష్యత్ నగరంలో నిర్వహించనున్న సమ్మిట్ ఏర్పాట్లపై జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన సమీక్ష చేపట్టారు. ఈ సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేంకట నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సహా అనేక మంది అధికారులు పాల్గొన్నారు.

మిగతా 2లో



# ఓఆర్ఆర్ పరిధిలోని 27 మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం!

**హైదరాబాద్,నవంబర్25(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ కోర్ అర్బన్ ప్రాంతం పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి ఆమోదం తెలిపింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల, అలాగే ఓఆర్ఆర్ వెలుపల దానిని ఆనుకొని ఉన్న మొత్తం 27 అర్బన్ స్థానిక సంస్థలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడానికి ప్రాథమిక ఆమోదం లభించింది. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ చట్టంతో పాటు తెలంగాణ మున్సిపల్ చట్టాల్లో అవసరమైన సవరణలకు ప్రభుత్వం సిద్ధమైంది. మంత్రిమండలి నిర్ణయాల వివరాలను ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది.

మిగతా 2లో

## జీహెచ్‌ఎంసీ విస్తరణ నిర్ణయం


- ఓఆర్ఆర్ పరిధి యూఎల్‌బీల విలీనానికి ఆమోదం
- 27 మున్సిపాలిటీలు– కార్పొరేషన్లు జీహెచ్‌ఎంసీ లోకి
- భవిష్యత్‌లో జీహెచ్‌ఎంసీ పునర్వ్యవస్థీకరణపై నిర్ణయం
- రాబోయే దశాబ్దానికి విద్యుత్ అవసరాల సమీక్ష
- 2,000 మెగావాట్ల పంప్ స్టోరేజ్ పవర్ కొనుగోలు నిర్ణయం
- పారదర్శకత కోసం కొత్త డిస్కం ఏర్పాటు



2లో

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ముమ్మర ఏర్పాట్లు

- 2047 దార్శనిక పత్రానికి తుదిమెరుగులు
- సదస్సు ఏర్పాట్లకు సీఎం స్వయంపర్యవేక్షణ
- భారత్ ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ వేదిక
- సమీక్షల షెడ్యూల్: 25 నుంచి 30 వరుకు కీలక సమావేశాలు



**హైదరాబాద్,నవంబర్26 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం డిసెంబర్ 8, 9 తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు 2025 ఏర్పాట్లు తీవ్ర వేగంతో ముందుకు సాగుతున్నాయి. వివిధ రాష్ట్రాలు, అనేక దేశాల నుంచి ప్రముఖ ప్రతినిధులు విస్తృతంగా హాజరవుతున్న ఈ అంతర్జాతీయ సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ సదస్సుతో పాటు రాష్ట్ర భవిష్యత్ దిశను ప్రతిబింబించే కీలక దార్శనిక పత్రం 'తెలంగాణ రైజింగ్ 2047'ను విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి వరుస సమీక్షలు నిర్వహించనున్నారు.మంగళవారం నుంచి నెలాఖరు వరకు కమాండ్ కంట్రోల్ కేంద్రంలో జరిగే

మిగతా 2లో



# ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపుపై నెటిజన్ ట్వీట్,స్పందించిన కేటీఆర్

ఆర్టీసీ ఛార్జీల పెంపుపై నెటిజన్ ఆవేదన
కేటీఆర్ ఆసక్తికర ప్రతిస్పందన
"ప్రశ్న కాంగ్రెస్‌కే" — కేటీఆర్ వ్యాఖ్య
ప్రజా సమస్యపై అసెంబ్లీలో బీఆర్ఎస్ హామీ

**హైదరాబాద్,నవంబర్25 (తెలంగాణ ముచ్చట్లు)** తెలంగాణలో పెరిగిన ఆర్టీసీ బస్సు ఛార్జీలపై నెటిజన్ చేసిన వ్యాఖ్యకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు ఓటు వేశానని, కానీ పెరిగిన ఛార్జీల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరిన నెటిజన్‌కు కేటీఆర్ ఆసక్తికరంగా ప్రతిస్పందించారు. ఓటు వేసింది కాంగ్రెస్‌కే అయితే, ఈ ప్రశ్నకు సమాధానం కూడా కాంగ్రెస్‌నే అడగాలని వ్యాఖ్యానించారు. పటాన్‌చెరు నుంచి డీఎల్ఎఫ్ మార్గంలో నడిచే మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు ఛార్జీ ముప్పై రూపాయల నుంచి నలభై ఐదు రూపాయలకు పెరగడం ప్రయాణికులకు భారంగా మారిందని నెటిజన్ సామాజిక మాధ్యమ వేదికలో ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ పెరుగుదలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వ తీరును ప్రశ్నించాలని కేటీఆర్‌ను కోరాడు.

మిగతా 2లో

# అసెంబ్లీలో నేనే సీనియర్

- ఏడు సార్లు వరుస గెలుపు గుర్తు చేసిన మంత్రి
- కామారెడ్డిలో కేసీఆర్ ఓటమి పై వ్యాఖ్య
- కొదాడ ఘటన లాక్‌అప్ డెత్ కాదని స్పష్టం
- సీఎంఆర్ఎఫ్ చెక్ ఫ్రాడ్ కేసు ఆరోపణలపై స్పందన
- డీసీసీ అధ్యక్ష పదవి తానే తిరస్కరించానని వెల్లడింపు



2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# హైదరాబాద్‌ను అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం


(మొదటి పేజీ తరువాయి)

సమ్మిట్ ప్రచారానికి వివిధ సంస్థలు రూపొందించిన దృశ్యచిత్రాలు, వీడియోలను సీఎం పరిశీలించి కావాల్సిన మార్పులను సూచించారు. భారత్ భవిష్యత్ నగరంలో విభాగాలవారీగా చేపడుతున్న పనులు, అభివృద్ధి రూపరేఖలు ప్రచారంలో ముఖ్యంగా ప్రతిబింబించాలని సూచించారు. హైదరాబాదుకు పెట్టుబడిదారులను ఆకర్షించే అనుకూల అంశాలైన ఆవరణ రహదారులు, ప్రస్తుత లోపలి వలయ రహదారి, బాహ్య వలయ రహదారి, రాబోయే ప్రాదేశిక వలయ రహదారి, బందరు వరకు ప్రతిపాదిత కొత్త రహదారి, రైలు మార్గాలు, డ్రైపోర్ట్ వంటి అంశాలతో పాటు తెలంగాణలోని భాష, సంస్కృతి, వాతావరణ ప్రత్యేకతలను కూడా స్పష్టంగా వివరించాలన్నారు.

రాష్ట్రంలో 1999 నుంచి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం వచ్చినా విధాన నిర్ణయాల్లో ఎటువంటి మార్పులేకుండా పెట్టుబడులకు అనుకూల వాతావరణం కొనసాగుతోందని ప్రమాణంగా చాటి చెప్పాల్సిన అవసరాన్ని సీఎం సూచించారు. తెలంగాణకు ప్రత్యేకతను చాటే రామప్ప ఆలయంలోని నంది శిల్పం, సమ్మక్క సారక్క జాతర, నల్లమల్ల అడవుల్లోని పులులు, మహబూబ్‌నగర్ ఎద్దులు, జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యం సాధించిన పి.వి. నరసింహారావు వంటి ప్రముఖులు, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న కళాకారులు, క్రీడాకారులు, ప్రపంచ స్థాయి సంస్థలలో నాయకత్వ స్థానాల్లో ఉన్న తెలంగాణీయులు బ్రాండింగ్‌లో ప్రత్యక్షంగా కనిపించేలా ప్రదర్శన రూపకల్పన చేయాలని ఆయన ఆదేశించారు. పత్రికా, దృశ్య, డిజిటల్ వేదికలన్నింటిని బ్రాండింగ్‌కు సమర్థంగా వినియోగించాల్సిందిగా సూచించారు.

# ఓఆర్‌ఆర్ పరిధిలోని 27 మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం!

(మొదటి పేజీ తరువాయి)



జీహెచ్‌ఎంసీ పరిధిలో ఈ వ్యవస్థకు సుమారు పద్నాలుగు వేల ఏడు వందల ఇరవై ఐదు కోట్ల రూపాయల వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా. విద్యుత్ సర్కిళ్ల ఆధారంగా నగరాన్ని మూడు భాగాలుగా విభజించి ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రెండు విద్యుత్ పంపిణీ సంస్థలతో పాటు కొత్తగా మూడో డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, మిషన్ భగీరథ, సురక్షిత మంచి నీటి పథకాలతో పాటు హైదరాబాదు మెట్రో నీటి సరఫరా, సీవరేజ్ బోర్డు పవర్ కనెక్షన్లన్నీ ఈ కొత్త డిస్కమ్ పరిధిలోకి వస్తాయి. రాష్ట్రంలోని పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, వచ్చే దశాబ్దానికి అవసరమయ్యే విద్యుత్ ఉత్పత్తి, సరఫరా అంచనాలను పరిగణలోకి తీసుకుంటూ పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని విస్తరించాలని నిర్ణయం తీసుకుంది.

ఈ క్రమంలో ఐదు సంవత్సరాల కాలపరిమితి ఒప్పందాలతో మూడు వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు, అలాగే రెండు వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని నిర్ణయించారు. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పడానికి ఆసక్తి చూపే సంస్థలకు అనుమతులు ఇచ్చేందుకు కూడా ఆమోదం తెలిపింది. దాదాపు పది వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూమి, నీటిని ప్రభుత్వం కేటాయిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను రాష్ట్ర డిస్కమ్‌లకే విక్రయించాలని శరతు పెట్టనుంది.

పరిశ్రమలకు అవసరమైన శుద్ధ, పచ్చ విద్యుత్ సరఫరాను ధృవీకరించేందుకు కొత్త పరిశ్రమలకు స్వయంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పిస్తూ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానంలో మార్పులు చేయాలని నిర్ణయించారు. క్యాప్టివ్ పవర్ ఉత్పత్తికి దరఖాస్తు చేసే కొత్త పరిశ్రమలకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని, విద్యుత్ ఉత్పత్తిపై ఎలాంటి పరిమితి ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌లో నిర్మించబోయే కొత్త 800 మెగావాట్ల యూనిట్‌ను ఎన్టీపీసీ ఆధ్వర్యంలో చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. పాల్వంచ, మక్తల్‌లో విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల నిర్మాణానికి అవకాశాలను కూడా పరిశీలించనున్నారు.

దుమ్ముగూడెం మండలం పెద్ద నల్లబెల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ యువత కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి 20.28 ఎకరాల ప్రభుత్వ భూమిని, ములుగు జిల్లా జగ్గన్నపేటలో స్పోర్ట్స్ పాఠశాలకు 40 ఎకరాల భూమిని కేటాయించారు. రాష్ట్రంలో ఉన్న 56 ఏటీసీలకు అదనంగా జూబ్లీహిల్స్‌తో పాటు మరో ఆరు ఐటీఐలను ఏటీసీలుగా మార్చు చేయాలని కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

# నూతన 'లేబర్ కోడ్'లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయవద్దు

(మొదటి పేజీ తరువాయి)



ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మన్, ఐజెయు జాతీయ అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులతో పాటు వైట్ కాలర్ ఉద్యోగులు పరోక్షంగా తమ హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోడి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కనీసం కార్మిక సంఘాల నేతలతో చర్చించకుండానే నూతన లేబర్ కోడ్‌లను అమలు చేయడం ఆశ్చర్యకరమన్నారు. నూతన లేబర్ కోడ్‌లపై ప్రధాన మీడియాలు చర్చలు పెట్టకపోవడం విడ్డూరమని, కార్పొరేట్ శక్తుల చేతుల్లో మీడియా బంది అయిపోయిందని విమర్శించారు. రాబోయే రోజుల్లో న్యాయవ్యవస్థ కూడా రాజకీయ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోవడం ఖామమనే అభిప్రాయం వ్యక్తమవుతోందన్నారు. జాతీయ మీడియాతో పాటు తెలుగు ప్రధాన పత్రికలు సైతం ప్రస్తుతం అమల్లోకి వచ్చిన లేబర్ కోడ్‌ల కారణంగా కార్మికులు, ఉద్యోగులకు కలిగే లాభ, నష్టాలను వివరించకపోవడం బాధకరమని చెప్పారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలతో వర్కింగ్ జర్నలిస్టు అంటే మెడికల్ రిప్రజెంటివ్ ఉద్యోగంతో సమానంగా చూస్తున్నారని శ్రీనివాస రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 26 మందితో కమిటి వేసి 1955లో మొదటి న్యూస్ పేపర్ యాక్ట్ తీసుకొచ్చారని గుర్తు చేశారు. దాని ఫలితమే ప్రస్తుత ఆర్ఎన్ఐ, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) ఏర్పాటు, జర్నలిస్ట్‌ల అపాయింట్‌మెంట్స్, 6 గంటల పని, మహిళ రక్షణ, సెలవులు తదితరవి జర్నలిస్టులకు రక్షణగా నిలుస్తున్నాయని ఆయన వివరించారు. మొదట్లో వేతన సవరణ ప్రతి సంవత్సరం అమలు చేసేవారని, కాలక్రమేణ 3 నుంచి 5 సంవత్సరాలకు పెరిగిందని, ప్రస్తుతం వేతన సవరణ అమలు 15 సంవత్సరాలు దాటినప్పటికీ చేయడం లేదన్నారు.

అల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు పివి.కృష్ణరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చెపట్టినప్పటీ నుంచి బ్యాంకింగ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవుతోందన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేట్ బ్యాంకులను ప్రోత్సహించడం, మెర్జ్ పేరుతో బ్యాంకుల విలీనం తదితర లాంటివి బ్యాంకు ఉద్యోగుల శ్రమదోపిడీ చేయడమేనని స్పష్టం చేశారు. కార్పొరేట్ శక్తులతో చేతులు కలిపి ప్రైవేటైజెషన్ పేరుతో బ్యాంకులను విదేశీ సంస్థలకు అప్పగించడంతో పాటు మనీలెండర్స్ చేతుల్లోకి దేశ ప్రజలను నెట్టివేసేలా మోడి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందన్నారు.

ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్రం అమల్లోకి తెచ్చిన నూతన లేబర్ కోడ్‌లతో 'కంపెనీలకు లాభం, కార్మికులకు నష్టం' అని అన్నారు. ఐటి ఎంప్లాయిస్, స్పెషల్ జోన్(ఆధిభట్ల) ప్రాంతాలలో ఉద్యోగులకు యూనియన్లు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నూతన లేబర్ కోడ్‌ల రద్దు కోసం సుప్రీం కోర్టుకు వెళ్లడంతో పాటు.పాఠశాల, కళాశాల విద్యార్థులకు సైతం నూతన లేబర్ కోడ్‌ల వలన కలిగే నష్టాలను వివరించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్మిక సంఘాలన్ని కలిసి 10 రోజులు నిర్విరామంగా సమ్మె చేస్తే కేంద్రం దిగివస్తుందని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఏండి. యూసుఫ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై పోరాడే యూనియన్లను లేకుండా చేయడమే లక్ష్యంగా మోడి ప్రభుత్వం నూతన లేబర్ చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. శ్రామికులను నష్ట పరిచి పరిశ్రమలకు లాభం చేకూర్చేలా మోడి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా కార్మికులందరూ ఏకమై తమ నిరసన గళంతో నూతన లేబర్ కోడ్‌లు రద్దు చేసేలా మోడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.

టియుసిఐ నాయకుడు సూర్యం మాట్లాడుతూ నూతన లేబర్ చట్టాల ద్వారా గిగ్ వర్కర్లకు మేలు జరుగుతుందని ప్రధాని మోడి చెప్పడం హాస్యాస్పదమన్నారు. కంపెనీలకు వచ్చే లాభాల నుంచి కాకుండా గిగ్ వర్కర్లకు వచ్చే వేతనంలో కొద్ది మొత్తం పన్నుల రూపంలో వసూలు చేసి, వారి ప్రొటెక్షన్ కోసమని గొప్పలు చెప్పుకొవడం విడ్డూరమని దుయ్యబట్టారు. దేశ వ్యాప్తంగా సుమారు 40 కోట్ల మంది కార్మికులు ఉంటే, అందులో కేవలం 7 కోట్ల మందికి మాత్రమే పిఎఫ్, 3 కోట్ల మందికి ఇఎస్ఐ అమలవుతుందని శోచనీయమన్నారు. నూతన లేబర్ కోడ్‌లతో కలిగే నష్టాలను ప్రతి కార్మికుని వద్దకు చేరే విధంగా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఐఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి ఎస్.ఎల్. పద్మ మాట్లాడుతూ సత్యమేవ జయతే శ్రమయేవ జయతే అని మోడి ప్రభుత్వం కార్మికుల శ్రమను దొపిడీ చేస్తుందన్నారు. మహిళ ఉద్యోగులకు పట్టపగలే రక్షణ లేని పరిస్థితులు కనిపిస్తుంటే, రాత్రి సమయాల్లో కూడా మహిళలు ఉద్యోగం చేసుకొవచ్చనే హక్కు కల్పించడం బాధకరమని మండిపడ్డారు. ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లు శుష్క ప్రియులు శూన్య హస్తాలు అనే సామేత చందంగా ఉందని ఎద్దేవా చేశారు. దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పేరును శాశ్వతంగా రూపుమాపడానికే ఆయన అమలు చేసిన లేబర్ చట్టాలను ప్రస్తుత ప్రధాని మోడి రద్దు చేసి, వాటి స్థానాల్లో నూతన చట్టాలను తీసుకొస్తున్నారని ఆరోపించారు. ఎప్పుడు లేని విధంగా ప్రధాని మోడి తన ట్విట్టర్ ఖాతా ద్వారా నూతన లేబర్ కోడ్‌ల గురించి క్లుప్తంగా వివరించడం విడ్డూరమన్నారు.

ఈ సమావేశంలో టియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, ఐజేయు జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, టియుడబ్ల్యుజె ఉప ప్రధాన కార్యదర్శి కే.రాములు, రాష్ట్ర కార్యదర్శి వి.యాదగిరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రాజేష్, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, కార్యదర్శి బి. వెంకటేశం, ఐ.ఎఫ్.టి.యు నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ముమ్మర ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షల్లో గ్లోబల్ సదస్సు నిర్వాహణ విధానాలు, 2047 నాటికి తెలంగాణ అభివృద్ధి దిశను సూచించే దార్శనిక పత్రంపై తుదితయారీలు పూర్తి చేయనున్నారు. ఈ వరుస సమావేశాల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు సంబంధిత అంశాలపై బాధ్యత వహిస్తున్న మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొంటున్నారు.

నవంబర్ 25న గ్లోబల్ సదస్సు నిర్వహణపై, నవంబర్ 26న లాజిస్టిక్స్ మరియు సదస్సు ఏర్పాట్లపై, నవంబర్ 27న పరిశ్రమలు, వాణిజ్యం, సమాచార సాంకేతికం, రవాణా, రహదారులు-భవనాలు, ఆర్థిక వ్యవహారాలు, విద్యుత్, గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, మున్సిపల్ కార్యక్రమాలకు సంబంధించిన మౌలిక వసతులు-అభివృద్ధిపై సమీక్ష జరగనుంది. నవంబర్ 28న విద్య, యువజన సంక్షేమం, నైపుణ్యత, క్రీడలు, టూరిజం, దేవాదాయ శాఖలకు సంబంధించిన అంశాలు పరిశీలించబడతాయి. నవంబర్ 29న వ్యవసాయం, అనుబంధ రంగాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమంపై సమీక్ష జరుగుతుంది. నెలాఖరు రోజైన నవంబర్ 30న ఆరోగ్యం, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖలకు సంబంధించిన అంశాలను పరిశీలించి తుది నిర్ణయాలు తీసుకోనున్నారు.

# ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపుపై నెటిజన్ ట్వీట్,స్పందించిన కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)



తానే అభివృద్ధి ఆశతో కాంగ్రెస్‌కు ఓటు వేశానని, కానీ ఇలాంటి భారమైన పెంపు సముచితం కాదని తన పోస్టులో పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్యపై ప్రతిస్పందించిన కేటీఆర్, ఓటు వేసింది కాంగ్రెస్‌కే అయితే ఈ ప్రశ్నకు సమాధానం కూడా కాంగ్రెస్ పార్టీ నుంచే రావాలని పేర్కొంటూ వ్యాఖ్యానించాడు. అయితే ప్రజా సమస్య కనుక బస్సు ఛార్జీల పెంపుపై బీఆర్ఎస్ వైఖరిని అసెంబ్లీలో తప్పకుండా వెల్లడిస్తామని హామీ ఇచ్చారు.

గత అక్టోబర్‌లో టీజీఎస్‌ఆర్టీసీ బస్సు ఛార్జీలు పెరిగిన విషయం తెలిసిందే. కేటీఆర్ స్పందనపై సామాజిక మాధ్యమాల్లో మిశ్రమ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ప్రయాణికుల భారాన్ని ఎత్తి చూపుతుండగా, మరికొందరు కాంగ్రెస్‌కు ఓటు వేసి బీఆర్ఎస్‌ను ప్రశ్నించడం ఏమిటని వ్యాఖ్యానిస్తున్నారు.

# జీహెచ్‌ఎంసీ విస్తరణ నిర్ణయం

హైదరాబాద్,నవంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు):



తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు ఆమోదం తెలిపింది. హైదరాబాద్ శివారులో ఉన్న(ఓఆర్ ఆర్‌ను ఆనుకుని ఉన్న) మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. అలాగే.. అలాగే విద్యుత్ రంగం ప్రధానంగా ఈ భేటీ జరిగినట్లు మంత్రులు వెల్లడించారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాటలాడుతూ.. ఆదిభట్ల, పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి.. ఇలా అర్బన్ లోకల్‌బాడీలను జీహెచ్‌ఎంసీలో విలీనానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని ఈ 27 మున్సిపాలిటీలు ,కార్పోరేషన్ లను జీహెఎంసీ లో కలపాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. జీహెచ్‌ఎంసీని అలాగే ఉంచాలా... లేక విభజించాలా అనేది భవిష్యత్‌లో నిర్ణయం తీసుకుంటాం.. రాబోయే పదేళ్ళకు సరిపడే విద్యుత్ అవసరం పై సుధీర్ఘంగా చర్చించాం. 2 వేల మెగావాట్ల పంప్ స్టోరేజ్ పవర్ కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నాం. విద్యుత్ వ్యవస్థ లో పారదర్శకత కోసమే కొత్త డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. కొత్తగా స్థాపించే పరిశ్రమలకు తామంతట తామే విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పించాలని నిర్ణయించాం. ప్రభుత్వ అంతర్గత విషయాలు బయటకు చెప్పేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ అంశంపై కూడా కేబినెట్ లో చర్చ జరిగింది. దీనికి పై ఎంక్వరీ జరుగుతుంది అని శ్రీధర్‌బాబు అన్నారు.

# అసెంబ్లీలో నేనే సీనియర్

(మొదటి పేజీ తరువాయి)



మీడియా చిట్‌చాట్‌లో రాష్ట్ర ఇరిగేషన్, సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఒకే పార్టీ నుంచి వరుసగా ఏడు సార్లు గెలిచానని గుర్తు చేశారు. అసెంబ్లీలో కేసీఆర్ తర్వాత తానే సీనియర్ అని చెప్పారు. అయితే కేసీఆర్ వివిధ పార్టీల నుంచి గెలిచారని.. అలాగే కేసీఆర్ కామారెడ్డిలో ఓడిపోయారని గుర్తు చేశారు. తాను మాత్రం ఎప్పుడూ ఓడిపోలేదని చెప్పారు. కొదాడలో జరిగింది లాక్ అప్ డెత్ కాదని.. ఆయనపై సీఎంఆర్‌ఎఫ్ చెక్స్ ఫ్రాడ్ కేసు ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన డీసీసీ అధ్యక్ష పదవులు వచ్చిన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. సూర్యపేట డీసీసీ పదవి తమకు ఇస్తామన్నారని, అయితే తామే ఆ పదవిని వద్దనుకున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ఆపదలో ఉన్న మహిళలకు హెల్ప్‌లైన్ 14490

## ప్రారంభించిన ఎన్‌సీడబ్ల్యూ

హింస, వేధింపులు లేదా ఏ రూపంలోనైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళల కోసం జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) 24 గంటలూ అందుబాటులో ఉండే కొత్త హెల్ప్‌లైన్ నంబర్14490ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా మహిళలు ఈ నంబర్‌ను సంప్రదించి తాము ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకోవచ్చు. వీరికి హెల్ప్‌లైన్ సిబ్బంది సహాయం చేస్తారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించటానికి సాయపడతారు.








# సత్తుపల్లి సింగరేణిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన.!

- కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని హెచ్.ఓ.డి లకు వినతిపత్రం అందజేత.
- పాల్గొన్న సింగరేణి ఐక్య కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు.

**సత్తుపల్లి, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక సత్తుపల్లి పట్టణం సింగరేణి సంస్థ జే.వి.ఆర్ ఓసి, కిష్టారం ఓసి, జే.వి.ఆర్ సి.హెచ్.పి లలో ఐ.ఎన్.టి.యు.సి ఫిట్ సెక్రటరీలు రామారావు, బాలాజీ, నాగేశ్వరరావు ల ఆధ్వర్యంలో గని మేనేజర్లకు వినతిపత్రం ఇచ్చిన సింగరేణి ఐక్య కార్మిక సంఘాల నాయకులు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్ ల వల్ల కార్మికులు అనేక ప్రయోజనాలను కోల్పోతారని తెలియజేశారు.

ప్రైవేట్ పెట్టుబడి దారులు, విదేశీ పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉండే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయకపోతే భవిష్యత్తులో కార్మికులు కార్మిక సంఘాల ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని అదేవిధంగా కార్మికులు అనేక పోరాటాల వల్ల సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కలరాస్తుందని తెలియజేశారు.

కార్మికుడు పనిగంటలు పెంపు, ఉద్యోగ భద్రత, సమ్మె చేసే హక్కును కోల్పోవడం లాంటి అనేక ప్రయోజనాలను కోల్పోతారని తెలియజేశారు.

సింగరేణి వ్యాప్తంగా నేడు జరగబోయే అన్ని ఏరియాలలో జిఎం కార్యాలయాల వద్ద జరిగే కార్యక్రమాన్ని మన సత్తుపల్లి లో కూడా పెద్ద ఎత్తున సింగరేణి కార్మిక వర్గం పాల్గొనాలని, సింగరేణి ఐక్య కార్మిక సంఘాల కార్యచరణకు ప్రతి కార్మికుడు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఐఎన్టీయూసీ బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్, ఫిట్ సెక్రటరీ నరసింహారావు, సిఐటియు నాయకులు సంపత్, కార్తీక్, టీబీజీకేఎస్ నాయకులు చంద్రశేఖర్, ఐఎన్టియుసి అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు కోటి, సురేష్, ఐ.వి రెడ్డి వివిధ కమిటీ నాయకులు చంద్రమౌళి, రిషీశ్వరరావు, దొడ్డేపల్లి రమేష్, పొట్టి కిరణ్, రషీద్, రాము, అస్గర్ ఖాన్, సీతారామరాజు, కిషన్ రావు, నరేందర్, అశోక్, రమేష్, నజీర్, బాజీ, అఫ్రోజ్, శ్రీనివాసరావు, గోపి, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కార్యదర్శిగా సుంచు సుధాకర్



**కాజీపేట్ నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** బీసీ ఐక్య సంఘర్షణ సమితి హనుమకొండ జిల్లా కమిటీ కార్యదర్శిగా సుంచు సుధాకర్ ను నియమిస్తున్నట్టు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమౌళి తెలిపారు. ఈ సందర్భంగా చుంచు సుధాకర్ మాట్లాడుతూ తనకు ఈ కార్యదర్శి పదవి లభించడం తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. బీసీల ఐక్యతకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# గట్ల ఖానాపూర్ మాజీ ఎంపిటిసి శివశంకర్ తల్లి నాగమ్మ మృతి



- నాగమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించిన మాజీ జెడ్పిటిసి, సర్పంచ్‌లు

**పెద్దమందడి,నవంబర్25(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం గట్ల ఖానాపూర్ మాజీ ఎంపిటిసి నడిమింటి శివశంకర్ తల్లి నాగమ్మ అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. మృతి వార్త తెలుసుకున్న మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, వెల్టూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి నాయకులతో కలిసి మంగళవారం నాగమ్మ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.నాయకులు శివశంకర్ మరియు కుటుంబ సభ్యులను ఓదార్చి, నాగమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి వెంకటస్వామి, వెల్టూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,అమ్మపల్లె వెంకటేశ్వర రెడ్డి, వెల్టూర్ మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్, మద్దూరు వెంకటయ్య, వెంకటేష్, సతీష్, రాములు, అడ్వకేట్ వినోద్ కుమార్, కొండన్న, కావాలి రాజు తదితరులు పాల్గొన్నారు.





# మహిళల ఎదుగుదలే రాష్ట్ర పురోగతి పునాది

## ఎంపీ కడియం కావ్య

**స్టేషన్ ఘనపూర్, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్‌లోని ఎస్. కన్వెన్షన్‌లో మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాలపై వడ్డీ రాయితీ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాష హాజరయ్యారు. నియోజకవర్గంలోని 7 మండలాల 8,178 మహిళా సంఘాలకు రూ.17.36 కోట్లు విలువైన వడ్డీ రాయితీ చెక్కులను అతిథులు అందజేశారు.

**ఎంపీ డాక్టర్ కావ్య మాట్లాడుతూ,**

"మహిళలు ఏ పనినైనా చిత్తశుద్ధి, పట్టుదలతో చేస్తారు... అందుకే విజయాలు సాధిస్తున్నారు" అని అన్నారు. మహిళల అభివృద్ధి సమాజ అభివృద్ధికి దారితీస్తుందని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో డీ.ఆర్.డీ.ఓ, ఆర్.డీ.ఓ, డీ.పి.ఎంలు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ..**

**"మహిళా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆడపిల్లల అభివృద్ధికి అండగా నిలుస్తున్నారు" అని తెలిపారు. మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.**





# ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాం.!

## ఖమ్మం ఆర్ టి సి రీజినల్ మేనేజర్ ఏ.సరిరాం

**సత్తుపల్లి, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం రీజియన్‌లో ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచినట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ ఏ.సరిరాం తెలిపారు. మంగళవారం సత్తుపల్లి డిపోను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుణ్యక్షేత్రాల దర్శన పేరుతో పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని, భక్తులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శబరిమలై వెళ్లే అయ్యప్ప స్వాముల సౌకర్యం కోసం ఖమ్మం రీజియన్ పరిధిలో అన్ని డిపోల నుండి బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. అయ్యప్పలు వారు సూచించిన రూట్ ప్రకారం బస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. యాత్ర దానం దాతలు ముందుకు వచ్చినట్లయితే ప్రత్యేక బస్సులను ప్రత్యేక అవసరాలు ఉన్నవారికి ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. యాత్రదానం విజయవంతం చేయడానికి దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ప్రయాణికుల రద్దీని బట్టి ఆయా రూట్లలో బస్సుల సంఖ్య పెంచినట్లు ఆయన తెలిపారు. వివాహాది శుభకార్యాలకు అద్దె ప్రాతిపదికన బస్సులను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. సత్తుపల్లి బస్టాండ్‌ను పరిశీలించిన ఆయన, గ్యారేజ్ సిబ్బందితో సమావేశమయ్యారు. డిపో అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను డిపో మేనేజర్ ఊటుకూరి సునీతకు వివరించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అనేక చర్యలు చేపడుతున్నట్లు కూడా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డిపో మేనేజర్ ఊటుకూరి సునీత, అసిస్టెంట్ మేనేజర్ పి. విజయశ్రీ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ సాహితి, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# సత్తుపల్లి ఏసీపీ వసుంధర యాదవ్ ఆకస్మిక తనిఖీ

- స్టేషన్ రికార్డుల పరిశీలన
- కట్టుదిట్టమైన సూచనలు

**సత్తుపల్లి, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి ప్రాంత అధికారి వసుంధర యాదవ్ ఐపీఎస్ వేంసూర్ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో ఉన్న అన్ని రికార్డులను పరిశీలించారు. స్వాధీనం చేసిన వాహనాలను ఒకదాని తర్వాత ఒకటి చెక్ చేసి పరిస్థితిని తెలుసుకున్నారు. నేర నమోదు, న్యాయ పత్రాల పంపిణీ, సమాచార సేకరణ వ్యవస్థలను ఖచ్చితంగా, నిర్లక్ష్యం లేకుండా ఉపయోగించాలని సిబ్బందికి ఆదేశించారు.

రెడింగ్‌లో ఉన్న నేర నమోదు పత్రాలను పూర్తిగా పరిశీలించిన ఆమె, పోలీసు సేవలు వేగంగా, చురుకుగా అందాలి. రౌడీషీటర్లు, చరిత్రలో నేరాలు ఉన్నవారిపై నిరంతరం నిఘా ఉండాలి అని బృందానికి సూచించారు. గ్రామస్థాయి పర్యవేక్షణ బలపడేందుకు కానిస్టేబుళ్లను గ్రామ పోలీసు అధికారులుగా నియమించాలని స్టేషన్ అధికారిని ఆదేశించారు. స్థానిక నిఘాను పెంపొందించేందుకు గ్రామాల్లో నిఘా కెమెరాల ఏర్పాటు గురించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె సిబ్బందికి స్పష్టం చేశారు. చోరీ అయిన మొబైల్ ఫోన్లను జాతీయ పోర్టల్ ద్వారా త్వరగా గుర్తించి తిరిగి అందించే చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. తరువాత ఆమె ధాన్యం తనిఖీ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ పోలీసులు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎస్పీ సునిత రెడ్డి

◆ శాంతి–భద్రతలపై కీలక చర్చలు

**వనపర్తి,నవంబర్25(తెలంగాణ ముచ్చట్లు)**:వనపర్తి జిల్లా నూతన ఎస్పీగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన సునిత రెడ్డి, ఐపీఎస్ మంగళవారం కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి నీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇద్దరు ఉన్నతాధికారులు జిల్లా శాంతి భద్రతల పరిణామాలు, నేర నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కార చర్యలపై విస్తృతంగా చర్చించారు. రెవెన్యూ-పోలీసు శాఖల పరస్పర సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, ప్రజలకు అందించే సేవల ప్రభావాన్ని వృద్ధి చేయాలని నిర్ణయించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల తగ్గింపు, యువతలో చట్ట అవగాహన కార్యక్రమాల నిర్వహణ, మహిళల భద్రతను ప్రధాన అంశంగా తీసుకొని ప్రత్యేక చర్యల రూపకల్పనపై ఇద్దరు అధికారులు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో వేగవంతమైన స్పందనకు కట్టుబడి పనిచేస్తాం. జిల్లాలో శాంతి భద్రతలను మరింత మెరుగుపరిచేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం.. అని నూతన ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు.జిల్లా శాంతి, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పరస్పర సహకారంతో అన్ని విభాగాలు సమగ్రంగా పని చేయనున్నాయని కలెక్టర్ ఆదర్శ సురభి పేర్కొన్నారు.



## ఖమ్మంలో బీసీ జేఏసీ నిరసన.. జీవో 46 రద్దు చేయాలంటూ డిమాండ్

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 25,తెలంగాణ ముచ్చట్లు;** బీసీలకు అన్యాయం చేస్తున్న జీవో 46ను వెంటనే రద్దు చేయాలంటూ ఖమ్మం జిల్లాలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో తీవ్ర నిరసనలు జరిగాయి. ఖమ్మం ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్ సమీపంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద జీవో నెంబర్ 46 ప్రతులను దహనం చేస్తూ నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీలో అన్ని పార్టీల మద్దతుతో 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు జీవో 46 ద్వారా బీసీలకు నష్టం జరుగుతోందని, ప్రభుత్వం ఈ జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, అవసరమైతే పార్లమెంటులో ప్రైవేట్ బిల్లు తీసుకురావాలని సూచించారు. రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన హామీ వచ్చేంత వరకూ స్థానిక సంస్థల ఎన్నికలు జరగకూడదని ఆయన అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఎన్నికలకు వెళ్లేముందు 42శాతం రిజర్వేషన్లు సాధిస్తానని చెప్పి ఇప్పుడు వెనక్కి తగ్గడం సరైంది కాదని విమర్శించారు. బీసీ సబ్ ప్లాన్, రిజర్వేషన్ల హామీ అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆయన తీవ్రంగా మండిపడ్డారు.

ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ పిండిప్రోలు రామమూర్తి సహా పలువురు నేతలు కూడా మాట్లాడి, జిల్లాలో మరింత ఆందోళనలు, భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో జేఏసీ గౌరవ సలహాదారు డాక్టర్ కె.వి.కృష్ణారావు, వర్కింగ్ చైర్మన్ బత్తిని మధు గౌడ్, రాష్ట్ర బీసీ నాయకులు, ఉద్యమ నాయకులు కూరపాటి రంగరాజు, మోడీపల్లి కృష్ణమాచారి, మోత్కూరు వెంకటేశ్వర చారి, మొరం పాపారావు, బచ్చల పద్మ చారి, రాపోలు రాంబాబు, పుల్లారావు, లగ్సెట్టి మహేష్ పాల్గొన్నారు.






## పేదలకు సేవే మన ధ్యేయం: ఎంపీ కడియం కావ్య


**స్టేషన్ ఘనపూర్, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు)**:పేద ప్రజలకు సేవ చేయడం ప్రతి ప్రజాప్రతినిధి యొక్క ప్రధాన కర్తవ్యం కావాలని వరంగల్ ఎంపీ, దిశా కమిటీ అధిపతి డాక్టర్ కడియం కావ్య తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన దిశా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**జల సంరక్షణలో జాతీయ గుర్తింపు అభినందనీయం**

జిల్లాలో జల సంరక్షణకు చేపట్టిన చర్యలతో కేంద్ర ప్రభుత్వ జల పురస్కారం పొందడం పట్ల ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి కలెక్టర్ రిజ్వాన్ బాషాను అభినందించారు.

**అన్ని శాఖల పనితీరుపై సమగ్ర సమీక్ష**

గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, రహదారులు, భవనాలు, ఆరోగ్యం తదితర శాఖలు అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమావేశంలో విశదంగా పరిశీలించారు.




**ఎంపీ కావ్య మాట్లాడుతూ,** కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హత కలిగిన పేద కుటుంబానికి చేరేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**సాధారణ ప్రసవాలు పెరగాలని ఆదేశం**

జిల్లాలో సాధారణ ప్రసవాల శాతం తగ్గిపోవడం పట్ల ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. గర్భధారణ దశలో ఆశా కార్మికులు, అంగన్వాడీ సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ, ప్రసవ సమయానికి ఆపరేషన్‌ల సంఖ్య ఎందుకు పెరుగుతోందని ప్రశ్నించారు. మహిళలకు అవగాహన కల్పించి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు అధికమయ్యేలా చర్యలు తీసుకోవాలని వైద్య శాఖ అధికారులకు ఆదేశించారు.

**జిల్లా అభివృద్ధి దిశలో ముందుకు : ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం తగ్గించిన ఉపాధి హామీ పని దినాలను పెంచేలా ప్రాతినిధ్యం ఇవ్వాలి. మహిళా సంఘాల ద్వారా ప్రతి మండలంలో ఒక సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాలి. ప్రతి గ్రామంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు పశువులను పంపిణీ చేసి పాల ఉత్పత్తి పెంపును ప్రోత్సహించాలి. పిండి వంటల కేంద్రాలు ఏర్పాటు చేస్తే మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సూచించారు.

**విద్యా రంగంలో దిశా నిర్దేశం**

విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం "దిక్సూచి" కార్యక్రమాన్ని పాఠశాలలో అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే , ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ,విద్యార్థులకు ఆరోగ్య కార్డులు, ప్రత్యేక వైద్య శిబిరాలు, రక్తహీనత నివారణకు మాత్రల పంపిణీ వంటి చర్యలను వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, దిశా కమిటీ సభ్యులు మాధవి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.





## డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాల పంపిణీ

**దమ్మపేట, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేట నియోజకవర్గంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దమ్మపేట మండలం పట్వారిగూడెం గ్రామంలోని చెలికాని ఆదెమ్మ ఫంక్షన్ హాల్‌లో ఇందిర మహిళా శక్తి కార్యక్రమం భాగంగా ఈ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చెక్కులు అందజేశారు. ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబన కోసం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ వడ్డీలేని రుణాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. గ్రామీణ మహిళలు చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి రంగాల్లో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో 60కి పైగా సర్పంచ్ స్థానాలు మహిళలకు కేటాయించడం జరిగినట్లు పేర్కొన్నారు.

కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.





## వేలేరు మండలంలో అక్రమ ఇసుక దందా

**వేలేరు, 25 నవంబర్ (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల పరిధిలో అక్రమ ఇసుక రవాణా మళ్లీ పెరగడం స్థానిక ప్రజల్లో ఆందోళనకు గురిచేస్తోంది. గోదావరి ఇసుక పేరుతో కొంతమంది వ్యక్తులు రాత్రి వేళల్లో మండల చుట్టుపక్కల ఉన్న వాగులు, చెరువుల నుండి నాసిరకపు ఇసుకను అక్రమంగా తవ్వి తీసుకొస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం వల్ల ఇసుకకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని అక్రమ దందాగాళ్లు వాగు ఇసుకను గోదావరి ఇసుకతో కలిపి ట్రాక్టర్ ట్రిప్‌కు 8,000 నుండి 10,000 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

అక్రమ రవాణా రాత్రివేళల్లోనే జరుగుతుండగా, దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. అధికారులు "నిమ్మకు నీరెత్తినట్లు చూస్తూ చూడనట్లు వ్యవహరిస్తున్నారు" అంటూ స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

ఈ దందా కారణంగా ప్రజలకు ఇసుక ధరలు భారమవుతుండటంతో, తక్షణం జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని బాధితులు సంబంధిత విభాగాల అధికారులను కోరుతున్నారు.

## పి.బి. చారి రచనపై శాస్త్రీయ చర్చలు

**మేడ్చల్–మల్కాజిగిరి, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు) :** అంతర్జాతీయ ఎవల్యూషన్ డే సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు కమలానగర్ ఆఫీసులో ప్రముఖ విజ్ఞానవేత్త పి.బి. చారి రచించిన "విశ్వం జీవం మానవుడు" పుస్తకంపై స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు సమన్వయకర్తగా వ్యవహరించారు.ప్రముఖ సామాజిక ఉద్యమ నేత జయరాజు డార్విన్ ప్రతిపాదించిన ఎవల్యూషన్ సిద్ధాంతం, విశ్వం-జీవం-మానవుడి పరిణామ క్రమాన్ని సవివరంగా వివరిస్తూ, పి.బి.చారి రచనలో ప్రతిఫలించిన శాస్త్రీయ దృక్పథాన్ని ప్రశంసించారు. ఆవిర్భావం నుంచి నేచురల్ సెలెక్షన్ వరకూ కోట్ల సంవత్సరాల పరిణామ క్రమంలోనే మానవ మనుగడ సాధ్యమైందని, మతాలు చెబుతున్నట్లుగా మనిషి అకస్మాత్తుగా పుట్టలేదని స్పష్టం చేశారు.ఈ పుస్తకానికి ప్రముఖ విజ్ఞానవేత్త దేవరాజు మహారాజు ముందుమాట రాసిన విషయాన్ని గుర్తుచేస్తూ, విజ్ఞానవేత్త టి.రమేష్ పుస్తకంలోని శాస్త్రీయ అంశాలను పాల్గొన్నవారికి వివరించారు. విశ్వం ఏర్పడటానికి కారణమైన మహావిస్ఫోటనం, అనంతరం ఏర్పడిన పాలపుంతలు, నక్షత్ర సముదాయాలు, సూర్యుడు మరియు దాని ఉపగ్రహాల పరిణామం తదితర అంశాలను పుస్తక ఉదాహరణలతో చర్చించారు.ఎం.భాస్కర్‌రావు మాట్లాడుతూ, నేటి పాలకులు శాస్త్రవిజ్ఞానాన్ని మూఢనమ్మకాలతో మేళవించి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. మూఢనమ్మకాలు, అశాస్త్రీయ పోకడలను వదిలి శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రుక్కయ్య, శారద, పార్థసారథి, శశాంక్‌లు కూడా తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అధ్యక్షులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ, మానవ పరిణామ క్రమంలో మనుషులందరూ ఆఫ్రికా ఖండంలో ఉన్న ఒక తల్లి సంతానంగా అభివృద్ధి చెందినట్టు పి.బి.చారి పుస్తకంలో వివరించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, గౌసియా, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, శారద, శశాంక్, రుక్కయ్య, పార్థసారథి, భాస్కర్‌రావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ఆదివాసి విద్యార్థి పాపారావుకు ఓయూ డాక్టరేట్ అవార్డు



**నాచారం, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఆదివాసి సమాజానికి గర్వకారణంగా, గిరిజన విద్యార్థి ఉద్యమ నాయకుడు సాగబోయిన పాపారావుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డు లభించింది. సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ పి. విష్ణుదేవ్ పర్యవేక్షణలో పాపారావు "ఉప ప్రణాళిక మరియు గిరిజన అభివృద్ధి - తెలంగాణ రాష్ట్రంలోని ఐటీడీఏ భద్రాచలం యొక్క సామాజిక శాస్త్ర అధ్యయనం" అంశంపై పరిశోధన పూర్తి చేసి యూనివర్సిటీలో సమర్పించారు.శతాబ్దం పూర్తి చేసుకున్న ఉస్మానియా యూనివర్సిటీలోని సోషియాలజీ విభాగంలో మొట్టమొదటి ఆదివాసి పీహెచ్‌డీ అవ్వడం పట్ల విభాగంలోని ఆచార్యులు ప్రొఫెసర్ రామ్ షెఫర్డ్ భీనవేని, డాక్టర్ పరంధాములు, డాక్టర్ సోమేశ్వర్ పాపారావును అభినందించారు.మారుమూల ఆదివాసి గూడెంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన పాపారావు, చిన్ననాటి నుంచే అడవిలో ఆకులపై అక్షరాలు నేర్చుకున్నాడు. ప్రాథమిక విద్య ప్రభుత్వ పాఠశాలలో, హైస్కూలు ఆశ్రమ పాఠశాలలో పూర్తి చేశాడు. ఉన్నత విద్య కోసం హైదరాబాద్ చేరిన ఆయన పాలు పంపే డెలివరీ బాయ్, టెలిఫోన్ బూత్ ఉద్యోగిగా పనిచేసి వచ్చిన పాకెట్ మనీతో చదువును కొనసాగించాడు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమంలో చేరి "అధ్యయనం-పోరాటం" నినాదంతో ముందుకు సాగిన పాపారావు, జర్నలిజంలో ప్రయాణం కొనసాగిస్తూ గిరిజనుల అభివృద్ధిపై లోతైన అధ్యయనం చేశాడు. తొలి ఆదివాసి డాక్టరేట్ అందుకున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు."నాకు అక్షరాల జ్యోతి చూపించిన గురువులకు, జీవితం ఇచ్చిన తల్లిదండ్రులకు, దారి చూపించిన స్నేహితులకు జీవితాంతం రుణపడి ఉంటాను" అని పాపారావు పేర్కొన్నారు.

# 19 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి..



◆ అభినందించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 25, తెలంగాణ ముచ్చట్లు;** పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో బాధ్యతలు నిర్వహిస్తూ హెడ్ కానిస్టేబుల్ గా ఉద్యోగన్నతి పొందిన 19 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి అభినందించారు.
ఖమ్మం జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న 19 మంది పోలీసు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కలిపించారు. అందులో నలుగురు మహబూబాబాద్ జిల్లా,14 మంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు, ఒకరిని ఇతర విభాగానికి కేటాయిస్తు బదిలీ చేశారు.

# ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న యువకులు: ఇన్స్పెక్టర్ బాలకృష్ణ



**ఖమ్మం బ్యూరో, నవంబర్ 25, తెలంగాణ ముచ్చట్లు;** ఖమ్మం నగరంలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు.
మంగళవారం నగరంలోని రాపర్తి నగర్ లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు ముగ్గురు యువకులు ఒక మోటార్ సైకిల్ పై వస్తూ పోలీసుల చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈ ముగ్గురు కలసి గత కొంతకాలంగా చెడు వ్యసనాలకు బానిసలై చదువు మానేసి స్నేహితుల వెంట తిరుగుతూ మోటార్ సైకిల్ దొంగతనాలు చేస్తున్నారని తెలిపారు.. గత రెండు నెలల్లో ఖమ్మం రెండవ పట్టణ మరియు ఖానాపూర్ హవేలీ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం ఐదు మోటర్ సైకిల్ దొంగతనాలు చేశారని తెలిపారు. ఈ ముగ్గురు యువకులు కూడా మైనర్లని పేర్కొన్నారు. వారి నుండి ఏడు లక్షల విలువచేసే ఐదు మోటర్ సైకిల్లు రికవరీ చేసి న్యాయస్థానం ఎదుట హాజరు పరిచినట్లు ఇన్స్పెక్టర్ వివరించారు.





# వల్భపూర్‌లో పేలిన గ్యాస్ సిలిండర్, భారీగా ఆస్తి నష్టం

◆ ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

**ఎల్కతుర్తి, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం వల్భపూర్ గ్రామంలో మంగళవారం ఉదయం జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు, కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనతో గ్రామం ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రమాదం చోటుచేసుకోవడంతో పెద్ద ప్రాణ నష్టం తప్పింది. సిలిండర్ పేలిన వెంటనే మంటలు వేగంగా వ్యాపించి చిర్ర రాజయ్య గౌడ్ ఇంటి మొత్తం ఆస్తి దగ్ధమైంది. ఇంట్లో ఉన్న గృహోపకరణాలు, ధాన్యం, బట్టలు, పొదుపు డబ్బు, విలువైన పత్రాలు అన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. ఆర్థికంగా వెనుకబడిన ఈ కుటుంబం పూర్తిగా నిరాశ్రయులై తీవ్ర సమస్యల్లోకి వెళ్లింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చినా, అప్పటికే ఇల్లు పూర్తిగా ధ్వంసమైపోయింది. గ్రామస్థులు బాధిత కుటుంబానికి సాయం అందించేందుకు ముందుకు వస్తున్నారు. ఘటన వివరాలు తెలుసుకున్న ఎల్కతుర్తి మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు మంత్రి శ్రీకాంత్ యాదవ్ అక్కడికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ఈ విషాదాన్ని బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు ప్రభుత్వ సహాయం అందించేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అలాగే వెంటనే నిత్యావసర వంట సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో వల్భపూర్ మాజీ సర్పంచి అంబాల ప్రతాప్, అడ్డపు శ్రీ వర్ధన్, కోడం రమేష్, పోతిరెడ్డి బాబు, ఉడత సూర్యనారాయణ, చీరాల రంజిత్, దాసరి సాయి తేజతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి అత్యవసరంగా ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన గ్రామాల్లో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది.





# మోజర్ల ఉద్యానవన కళాశాలలో నూతన గ్రంథాలయ భవనం ప్రారంభం

◆ బాలికల వసతి గృహానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి

**పెద్దమందడి,నవంబర్25(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మోజర్ల కొండ లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన కళాశాలలో నూతనంగా నిర్మించిన ఆధునిక గ్రంథాలయ భవనాన్ని వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి మంగళవారం ఘనంగా ప్రారంభించారు. అనంతరం అదే ప్రాంగణంలో బాలికల వసతి గృహ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి పునాదిరాళ్లు వేశారు.కళాశాల అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించిన ఎమ్మెల్యే విద్యార్థులు, అధ్యాపకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా.. కళాశాలలో విద్యార్థుల కోసం మెరుగైన వసతులు, పరిశోధన అవకాశాలు, సాంకేతిక వనరుల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ..గ్రంథాలయం విద్యా సంస్థ హృదయం. విద్యార్థులు చదువులో ముందుకు సాగేందుకు, పోటీ పరీక్షల్లో రాణించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే బాలికల వసతి గృహం ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులకు సురక్షిత వాతావరణం కలుగుతుంది. వీటితో పాటు, విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించుకోవాలని, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కళాశాల అభివృద్ధికి మరిన్ని పథకాలను ప్రభుత్వం తీసుకురాబోతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.






# 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు రాచకొండ పోలీసుల భరోసా

వారానికి రెండుసార్లు సందర్శన

**మహేశ్వరం, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** రాచకొండ సీపీ సుధీర్ బాబు ఐపీఎస్ ఆదేశాల మేరకు రాచకొండ పోలీస్ కమిషనరేట్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఆర్కెఎసీ) ఆధ్వర్యంలో గోల్డెన్ కేర్ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ క్రమంలో మహేశ్వరం డీసీపీ కె. నారాయణ రెడ్డి ఐపీఎస్ సూచనలతో, మంగళవారం మహేశ్వరం పోలీస్ స్టేషన్ సీఐ హెచ్. వెంకటేశ్వర్లు, సెక్టార్ ఎస్సై, పీటర్ మొబైల్ సిబ్బంది కలిసి పీఎస్ పరిధిలో ఒంటరిగా నివసిస్తున్న 60 ఏళ్లు పైబడిన వృద్ధులను సందర్శించారు.వృద్ధుల అవసరాలను గుర్తించి వారికి నిత్యావసర సరుకులు, పండ్లు, అనారోగ్యంతో ఉన్నవారికి ఔషధాలు అందించారు. ప్రస్తుతం చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో రగ్గులు, స్వెటర్లు కూడా పంపిణీ చేశారు. వారానికి రెండుసార్లు వృద్ధుల ఇంటికి వెళ్లి వారి ఆరోగ్యం, బాగోగులు తెలుసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్‌తో కలిసి సీనియర్ సిటిజన్ల కోసం 'గోల్డెన్ కేర్ - మన కోసం శ్రమించిన వారికి మన సంరక్షణ' కార్యక్రమాన్ని కమిషనర్ కార్యాలయంలో ప్రారంభించిన విషయం తెలిసిందే. రాచకొండ కమిషనరేట్ పరిధిలో వృద్ధులకు సంరక్షణ, రక్షణ, గౌరవం అందించడమే దీని ప్రధాన లక్ష్యం.సహాయం కోరే వృద్ధులు సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ 14567 లేదా రాచకొండ వాట్సాప్ నంబర్ 8712662111 ద్వారా సంప్రదించాలని పోలీసులు సూచించారు.

# పీచరలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

**వేలేరు, 25 నవంబర్ (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు మంతపురి రాజు ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి - రేవంతన్న కానుకగా మహిళా సంఘాలకు చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీటీసీ జల్తారి సంపత్ మాట్లాడుతూ – "గత ప్రభుత్వం అందించిన బతుకమ్మ చీరల్లో నాణ్యత లోపం ఉండడంతో ఆడపడుచులు వాటిని ఉపయోగించలేకపోయారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మంచి నాణ్యతతో కూడిన, ఉపయోగపడే చీరలను తయారు చేయించి మహిళలకు అందిస్తుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ నాణ్యతతో కూడిన కానుకను అందిస్తోంది" అని తెలిపారు.
కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జల్తారి సంపత్, పెద్ది నగేష్, జల్తారి శ్రీనివాస్, భైరబోయిన గట్టయ్య, అవునూరి మల్లయ్య, గుండెల్లి అనిల్, పాము జగదీశ్, సమ్మయ్య తదితరులు పాల్గొని మహిళలకు చీరలను అందజేశారు. నాయకులు మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పి.బి. చారి రచనపై శాస్త్రీయ చర్చలు

**మేడ్చల్–మల్కాజిగిరి, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు) :** అంతర్జాతీయ ఎవల్యూషన్ డే సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు కమలానగర్ ఆఫీసులో ప్రముఖ విజ్ఞానవేత్త పి.బి.చారి రచించిన "విశ్వం జీవం మానవుడు" పుస్తకంపై స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు సమన్వయకర్తగా వ్యవహరించారు.ప్రముఖ సామాజిక ఉద్యమ నేత జయరాజు డార్విన్ ప్రతిపాదించిన ఎవల్యూషన్ సిద్ధాంతం, విశ్వం-జీవం-మానవుడి పరిణామ క్రమాన్ని సవివరంగా వివరిస్తూ, పి.బి. చారి రచనలో ప్రతిఫలించిన శాస్త్రీయ దృక్పథాన్ని ప్రశంసించారు. ఆవిర్భావం నుంచి నేచురల్ సెలెక్షన్ వరకూ కోట్ల సంవత్సరాల పరిణామ క్రమంలోనే మానవ మనుగడ సాధ్యమైందని, మతాలు చెబుతున్నట్లుగా మనిషి అకస్మాత్తుగా పుట్టలేదని స్పష్టం చేశారు.ఈ పుస్తకానికి ప్రముఖ విజ్ఞానవేత్త దేవరాజు మహారాజు ముందుమాట రాసిన విషయాన్ని గుర్తుచేస్తూ, విజ్ఞానవేత్త టి.రమేష్ పుస్తకంలోని శాస్త్రీయ అంశాలను పాల్గొన్నవారికి వివరించారు. విశ్వం ఏర్పడటానికి కారణమైన మహావిస్ఫోటనం, అనంతరం ఏర్పడిన పాలపుంతలు, నక్షత్ర సముదాయాలు, సూర్యుడు మరియు దాని ఉపగ్రహాల పరిణామం తదితర అంశాలను పుస్తక ఉదాహరణలతో చర్చించారు.

ఎం.భాస్కర్‌రావు మాట్లాడుతూ, నేటి పాలకులు శాస్త్రవిజ్ఞానాన్ని మూఢనమ్మకాలతో మేళవించి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. మూఢనమ్మకాలు, అశాస్త్రీయ పోకడలను వదిలి శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రుక్కయ్య, శారద, పార్థసారథి, శశాంక్‌లు కూడా తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

అధ్యక్షులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ, మానవ పరిణామ క్రమంలో మనుషులందరూ ఆఫ్రికా ఖండంలో ఉన్న ఒక తల్లి సంతానంగా అభివృద్ధి చెందినట్టు పి.బి.చారి పుస్తకంలో వివరించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, గౌసియా, వెంకటేశ్వరరావు,శ్రీనివాస్, శారద, శశాంక్, రుక్కయ్య, పార్థసారథి, భాస్కర్‌రావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.






# ఉప్పల్ జెడ్పిహెచ్ఎస్‌లో డిగ్రీ కళాశాల సమస్యలపై కలెక్టర్ మను చౌదరి సమీక్ష

**మేడ్చల్ మల్కాజ్గిరి, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో నడుస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి సందర్శించారు. కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రిన్సిపల్ వివరించగా, మొత్తం 450 మంది విద్యార్థులు కేవలం ఐదు గదుల్లో రెండు పూటలా క్లాసులు వినాల్సి వస్తుండటం తీవ్ర అసౌకర్యంగా ఉందని తెలిపారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందిస్తూ ఇంజనీరింగ్ శాఖతో భౌతిక పరిశీలన చేయించి అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కళాశాల తరఫున అదనపు బాత్రూముల అవసరాన్ని కూడా ప్రిన్సిపల్ వెల్లడించగా, వాటి నిర్మాణాన్ని పరిశీలించి త్వరితగతిన ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం జెడ్పిహెచ్ఎస్ హై స్కూల్ హెడ్మాస్టర్ పాఠశాలకు అదనపు గదులు, డైనింగ్ హాల్ అవసరం ఉందని కోరగా, ప్రతిపాదనలు పంపితే పరిశీలించి మంజూరు చేస్తామని కలెక్టర్ సూచించారు.సందర్భన సందర్భంగా కాలేజ్ వాచ్మెన్ తనకు జీతం సకాలంలో అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినతి పత్రం అందజేయగా, కలెక్టర్ వెంటనే సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విజయ్, ఫ్యాకల్టీ సభ్యులు ఇతరులు పాల్గొన్నారు.





# సింగరేణిలో శ్రామిక చట్టాలపై అవగాహన.!

## జె.వి.ఆర్ ఓసీ–2లో నూతన కోడ్‌ల వివరణ

**సత్తుపల్లి, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక పట్టణంలో సింగరేణి కంపెనీ జె.వి.ఆర్ ఓసీ-2లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన శ్రామిక చట్టాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. బేస్ పనిముట్లశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో డీజీఎంఎస్ నాగుల్ మీరా, ప్రాంత ప్రధాన నిర్వాహకులు చింతల శ్రీనివాస్ పాల్గొని ఉద్యోగులకు నూతన శ్రామిక కోడ్‌ల అంశాలను వివరించారు.

వేతనాల కోడ్-2019, పారిశ్రామిక సంబంధాల కోడ్-2020, సామాజిక భద్రత కోడ్-2020, వృత్తి భద్రత-ఆరోగ్యం-పని పరిస్థితుల కోడ్-2020 వంటి నాలుగు ప్రధాన చట్టాల లక్ష్యాలు, వాటి అమలు విధానం, ఉద్యోగులకు వాటి ద్వారా లభించే ప్రయోజనాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.

ఈ సంస్కరణలతో కార్మిక నిబంధనలు సులభతరం కావడంతో పాటు కార్మిక సంక్షేమం మెరుగుపడుతుందని, పారిశ్రామిక రంగ బలోపేతానికి కూడా ఇవి దోహదం చేస్తాయని దక్షిణ మధ్య మండల గనుల భద్రత ఉప మహాసంచాలకులు అభిప్రాయపడ్డారు. మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా శ్రామిక వ్యవస్థను మెరుగైన రూపంలో మార్చడమే కొత్త కోడ్‌ల ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు.

కార్యక్రమంలో జె.వి.ఆర్ ఓసీ-2 ప్రాజెక్టు అధికారి ఎన్వీఆర్ ప్రహ్లాద్, ప్రాజెక్టు ఇంజనీర్ డి. శ్రీనివాసరావు, ఎస్.ఓ.ఎం. బి. రాజేశ్వరరావు, సంక్షేమ అధికారి కె. శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ నాయకుడు ఎన్. రామారావు (పిట్ కార్యదర్శి), ఏఐటీయూసీ శాఖ కార్యదర్శి సుధాకర్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన... టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు

**ఖమ్మం బ్యూరో, నవంబర్25, తెలంగాణ ముచ్చట్లు;** వైరా మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు మాటూరుపేట నందు వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు పరిశీలించి నిర్మాణానికి సంబంధించిన ప్రభుత్వం నుంచి వచ్చే బిల్లుల గురించి లబ్ధిదారులతో అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇల్లు రాణి లబ్ధిదారులు నిరాశ చెందవద్దని రెండో జాబితాలో కచ్చితంగా అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తో మాట్లాడి మంజూరు చేయిస్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం మాటూరు పేట నందు అనారోగ్యంతో ఉన్న పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ల నాగరాజు, గుత్తికొండ వీరబాబు యామాల కిరణ్ , అమర్లపూడి నవీన్, బండ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# ఎర్త్ సైన్స్ యూనివర్సిటి పనులను పరిశీలించిన ...

## ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ జితేష్ వి పాటిల్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు

**ఖమ్మం బ్యూరో,నవంబర్ 25, తెలంగాణ ముచ్చట్లు;** భద్రాద్రి జిల్లాలో జాతీయ స్థాయి కోర్సులతో ఏర్పాటు చేస్తున్న డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు యూనివర్సిటీ ప్రాంగణాన్ని, సీఎం కోసం సభా స్థలాన్ని, ప్రాంగణాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు లతో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు..

# మేడ్చల్ జిల్లాలో మహిళా సంఘాలకు రూ. 2.33 కోట్లు వడ్డీ లేని రుణాల పంపిణీ

**మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంలో మహిళలను భాగస్వాములను చేయడమే కాకుండా, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్లు శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. శామీర్‌పేట్ మండలం ఆదిలాబాద్‌లోని శుభం కన్వెన్షన్ హాల్లో మంగళవారం మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన 3120 మహిళా సంఘాల సభ్యులకు రూ. 2 కోట్ల 33 లక్షల వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి చెక్కులను పంపిణీ చేశారు.






ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ మను చౌదరి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్థిక కమిషన్ సభ్యులు జైపాల్ రెడ్డి, జిల్లా సమాఖ్య అధ్యక్షులు అజేయ లక్ష్మి తదితరులు హాజరయ్యారు.

చీఫ్ విప్ మాట్లాడుతూ మహిళలు విద్యావంతులైతే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని, అందుకోసం 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలల్లో మౌలిక వసతులను బలోపేతం చేశామని తెలిపారు. మహిళలు రాజకీయ రంగంలో కూడా ముందుకు రావాలని ప్రభుత్వ సహాయం పూర్తిగా అందుబాటులో ఉందన్నారు.ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజం పురోగమిస్తుందని, గృహ బాధ్యతలతో పాటు ఆర్థిక వ్యవస్థలో కూడా మహిళలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. మహిళలు నిరంతరం కష్టపడి పనిచేసే సైనికులని అభివర్ణించారు.

జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ప్రణాళికలో మహిళలే కేంద్ర బిందువుగా ఉంటారని, మహిళా సంఘాలు చూపిస్తున్న నిబద్ధత అభినందనీయమని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా దేశాధ్యక్షులుగా, కంపెనీల సీఈవోలుగా మహిళలు ఎదుగుతున్న ఉదాహరణలను ప్రస్తావిస్తూ, మహిళలు తమ ఉత్పత్తులకు నాణ్యత పెంచి గ్లోబల్ మార్కెట్లలో పోటీపడాలని సూచించారు.

కార్యక్రమంలో ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, తహసీల్దారు, డిఆర్డీఓ సాంబశివరావు, మహిళా సంఘాల సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రారంభంలో తెలంగాణ సాంస్కృతిక సారధుల పాటలు కార్యక్రమాన్ని మరింత రంజింపజేశాయి.




# ఇందిరమ్మ చీరలను మహిళలకు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు...

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 25, తెలంగాణ ముచ్చట్లు:**సత్తుపల్లి శాసనసభ్యులు. శ్రీమతి. డాక్టర్ మట్టా రాగమయి దయానంద్. ఆదేశాల మేరకు.తల్లాడ మండల పరిధిలోని రంగం బంజర గ్రామంలో తల్లాడ మండల అధ్యక్షులు. కాప సుధాకర్ సూచనల మేరకు రంగం బంజర గ్రామంలో కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా బొట్టు పెట్టి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు. కార్యకర్తలు స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు సంఘాల సభ్యులు ప్రతి ఇంటికి బొట్టుపెట్టి ఇంద్రమ్మ చీరలను అందించారు. అలాగే 18 ఏళ్లు నిండిన ప్రతి పేద మహిళలకు ఈ ఇందిరమ్మ చీరలను అందించాలని భావిస్తున్న నేపథ్యంలో. ఓ మోడల్ గా సిరిసిల్ల చేనేత చీరలను అందించాలని పుట్టింటి చీర ఆడబిడ్డకు పెడితే ఎంత ఆనందంగా ఉంటుందో అదే తరహాలో ప్రతి మహిళ ఆనందం పొందాలన్న లక్ష్యంతో. ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. అయితే ఇలా తమ ఇళ్లకు వచ్చి బొట్టు పెట్టే చిరాలను అందించడం పట్ల మహిళలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో జిపిఓ వెంకటకృష్ణ, గ్రామ దీపిక సుజాత, ఇందిరమ్మ కమిటీ సభ్యులు. మాజీ వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పగడాల లచ్చిరెడ్డి , దేవరపల్లి శ్రీనివాసరావు, తల్లాడ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు. ధర్మసోత్ దశరథ్ నాయక్, చల్లా భద్రయ్య, మడిపల్లి నాగమణి,మోడెం స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# నేడు వెలటూర్ బిఆర్ఎస్ పార్టీ సన్నాక సమావేశం

**మల్లక్ సురేష్ కుమార్**
**గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు**



**పెద్దమందడి,నవంబర్25(తెలంగాణ ముచ్చట్లు):**పెద్దమందడి మండలం వెలటూర్ బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో నేడు సన్నాక సమావేశం గ్రామంలో 8:30 గంటలకు నిర్వహిస్తున్నట్టు గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మల్లక్ సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

వెలటూర్ బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు మరియు పార్టీ అభిమానులు తప్పక హాజరు కావాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గ్రామ నాయకులతో చర్చించి బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిని నిర్ణయిస్తామని మల్లక్ సురేష్ కుమార్ తెలిపారు.

# టాటాసన్స్ బోర్డులోకీ భాస్కర్ భట్!



టాటా గ్రూప్‌పై పూర్తి ఆధిపత్యం సాధించేందుకు టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా పావులు కదుపుతున్నారు. ఈ నెల మొదట్లో సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్‌లో ఆయన కుమారుడైన నెవిల్ టాటాతో పాటు సన్నిహితుడైన భాస్కర్ భట్ కూడా ట్రస్టీగా చేరారు. టాటా గ్రూప్ ప్రధాన కంపెనీ అయిన టాటా సన్స్ బోర్డులోకీ భట్‌ను చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఒక ఆంగ్ల వార్తా సంస్థ తెలిపింది. డిసెంబరులో జరిగే సమావేశంలో భట్ పేరును పరిశీలించొచ్చని సమాచారం.టైటన్‌కు దీర్ఘకాలం పాటు మేనేజింగ్ డైరెక్టరుగా వ్యవహరించిన భట్ (71) నోయల్ టాటాకు సన్నిహితుడు. టాటా గ్రూప్ కొన్ని కంపెనీల బోర్డుల్లోనూ భట్ సేవలందించారు. టాటా సన్స్‌లోకీ భట్‌ను తీసుకురావడం ద్వారా గ్రూప్‌పై నోయల్ మరింత పట్టు పెంచుకోనున్నారని తెలుస్తోంది.





# పెద్దల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

## అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



**మేడ్చల్–మల్కాజ్గిరి, నవంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):**మహిళ, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం మంగళవారం మేడ్చల్-మల్కాజ్గిరి సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా వయోవృద్ధులకు శుభాకాంక్షలు తెలుపుతూ మాట్లాడారు. తల్లితండ్రులు మరియు వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం-2007 ప్రకారం పెద్దలకు కల్పించిన హక్కులు, రక్షణ గురించి అవగాహన కల్పించారు. వయోవృద్ధులను నిరాదరణకు గురిచేయడం లేదా సరిగ్గా చూసుకోకపోతే చట్టపరంగా జరిమానాలు, శిక్షలు తప్పవని ఆమె హెచ్చరించారు.తదుపరి జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ, పెద్దల సంక్షేమానికి ప్రతి రెవెన్యూ డివిజన్‌కు రెవెన్యూ డివిజనల్ అధికారి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. వయోవృద్ధులు ఎవరైనా నిరాదరణకు గురైనప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 14567 కు కాల్ చేసి తమ సమస్యలు తెలియజేయవచ్చని సూచించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా సంక్షేమ అధికారి శారద, సీడీపీవోలు, జిల్లా సీనియర్ సిటిజన్ల అసోసియేషన్ సభ్యులు, ఓల్డ్ ఏజ్ హోమ్స్ ప్రతినిధులు, డీడబ్ల్యూఓ కార్యాలయం సిబ్బంది, డీపీయూ యూనిట్ సిబ్బంది, సీనియర్ సిటిజన్లు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి చేరిన కర్ణాటకం

- ముఖ్యమంత్రి పీఠం కోసం డీకే పావులు
- తాజా పరిణామాలపై ఖర్గే చర్చలు
- రాహుల్ నిర్ణయం కోసం ఎదురుచూపులు



కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవిని కోరుకుంటున్న డీకే శివకుమార్ అధిష్ఠానవర్గంపై ఒత్తిడిని పెంచారు. ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌కు మద్దతు ఇచ్చే కొందరు ఎమ్మెల్యేలు ఢిల్లీ చేరుకున్నారు. మరో బృందం కూడా చేరుకోవచ్చునని తెలుస్తున్నది. వీరికి ఇప్పటి వరకు కేంద్ర నాయకులను కలుసుకోవడానికి అపాయింట్‌మెంట్ దొరకలేదు. ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్ళడానికి తనకు సంబంధం లేదని శివకుమార్ పైకి అంటున్నా లోపాయికారిగా శివకుమార్‌కు మద్దతుగా సంతకాల సేకరణ జరుగుతున్నట్టు తెలిసింది. తమకు మద్దతు భారీగా వ్యక్తమవుతున్నదని శివకుమార్ వర్గీయులు చెబుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తాజా పరిణామాలపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో, డీకే శివకుమార్‌తో చర్చలు జరిపారు. పరిస్థితులను ఆకళింపు చేసుకున్నారు. అయితే అంతిమంగా పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్ణయంపైనే ఏ విషయమైనా ఆధారపడి ఉంది. ఖర్గే మరో రెండు రోజులలో రాహుల్‌కు రాష్ట్ర పరిస్థితిని వివరిస్తారు. ఆ తరువాత రాహుల్ ఇరువురిని పిలిచి సంప్రదింపులు జరుపుతారని తెలుస్తున్నది.

వచ్చే బడ్జెట్ తానే ప్రవేశపెడతానని ప్రకటించిన సిద్ధరామయ్య కొంత మెత్తపడినట్టు కనిపిస్తున్నది. ఇరువురు నాయకులు సోమవారం చిక్‌బల్లాపూర్‌లో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ఒకే వేదికపై కనిపించడం ఆశ్చర్యం కలిగించింది. అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని సిద్ధ రామయ్య అన్నారు. సిద్ధరామయ్య ఏది చెప్పినా తామందరికీ వేద వాక్యమని శివకుమార్ అన్నారు.

బిహార్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత ఇప్పటి వరకు కాంగ్రెస్ కేంద్ర నాయకులు సమావేశమే కాలేదు. కర్ణాటక వ్యవహారాలు కూడా చర్చకు రాలేదు. అయితే ఢిల్లీ నాయకులు మాత్రం రాష్ట్ర పరిస్థితిని గమనిస్తూనే ఉన్నారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధించిన నాటి నుంచి సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ ఏర్పడింది. అయితే కాంగ్రెస్ అధిష్ఠానవర్గం సిద్ధరామయ్యకే మొగ్గు చూపింది. సిద్ధరామయ్యకు ఎస్సీ, ఎస్టీ , బీసీలలో మంచి పట్టున్నది. వెనుకబడిన వర్గాలను సొంతంగా సమీకరించారు. ఈ సమీకరణ కాంగ్రెస్‌కు కలిసివచ్చింది. కర్ణాటకలో ప్రాబల్యం గల రెండు కులాలలో ఒకటి లింగాయతులు కాగా మరొకటి ఒక్కలిగలు. లింగాయతులు ఇప్పటికే బీజేపీతో కలిసి ఉన్నారు. ఒక్కలిగలు గత ఎన్నికలలో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారు. ఇందుకు శివకుమార్ నాయకత్వమే కారణం. సాధారణంగా జేడీఎస్‌కు ఒక్కలిగల పార్టీగా పేరున్నది. గత ఎన్నికలలో ఒక్కలిగలు జేడీఎస్‌ను పక్కన పెట్టి కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడానికి కారణం శివకుమారే. ఆయనే ముఖ్యమంత్రి అవుతారనే అభిప్రాయం ఉండడం కూడా కారణమే. ఆయనకు ఆర్థిక వనరులు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఎన్నికల నిర్వహణలో తన సమర్థత కూడా నిరూపించుకున్నారు. సిద్ధరామయ్యకు, శివకుమార్‌కు చెరి రెండున్నర ఏళ్లు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం సముదాయించింది. అందుకే శివకుమార్ అవకాశం చూసుకుని ఒత్తిడి చేస్తున్నారని అంటున్నారు. వెనుకబడిన వర్గాలకు చెందిన సిద్ధరామయ్యను తొలగించడం వల్ల ఫలితాలు ఎలా ఉంటాయోనని అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తున్నది. కాంగ్రెస్‌ను వెనుకబడిన వర్గాలకు వ్యతిరేకిగా బీజేపీ ప్రచారం చేస్తుందని కూడా కొందరు అంటున్నారు. ఒక్కలిగల మద్దతు గల శివకుమార్ బీజేపీ వైపు వెళ్లే అవకాశం ఉందనే మాట కూడా వినబడుతున్నది. కానీ లింగాయతుల మద్దతు లభించిన తరువాత బీజేపీ అధిష్ఠానం యడ్యూరప్పను తొక్కివేసిన తీరును ఒక్కలిగ నాయకులు గమనిస్తున్నారు. కాంగ్రెస్‌లో ఉండే వెసులుబాటు బీజేపీలో ఉండదని శివకుమార్‌కు తెలుసు. అందుకే కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తూ ముఖ్యమంత్రి పదవి సాదించుకోవాలని భావిస్తున్నారు.

# టాటా సియారా వచ్చేసింది.. ధర రూ.11.49 లక్షల నుంచి ప్రారంభం

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ ప్యాసింజర్స్ వెహికల్స్ తన ఐకానిక్ మోడల్ సియారాను మళ్లీ మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. 1991లో తొలిసారి విడుదలైన ఈ మోడల్‌ను.. 2003లో నిలిపివేశారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఇప్పటి అవసరాలు, హంగులతో కొత్త సియారాను మళ్లీ తీసుకొచ్చారు. అప్పటి రెట్రోలుక్‌ను కొనసాగించిన టాటా మోటార్స్.. దీన్ని ‘రీబర్త్ ఆఫ్ ఎ లెజెండ్’గా అభివర్ణించింది. ఈ ఎస్‌యూవీ ధర రూ.11.49 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. డిసెంబర్ 16 నుంచి బుకింగ్స్ ప్రారంభమవుతాయని కంపెనీ తెలిపింది. టాటా డీలర్‌షిప్‌ల వద్ద గానీ, ఆన్‌లైన్‌లో గానీ బుక్ చేసుకోవచ్చని పేర్కొంది. 2026 జనవరి 15 నుంచి డెలివరీలు ప్రారంభమవుతాయని వెల్లడించింది.

ఇంజిన్ విషయానికొస్తే.. కొత్త సియారా పెట్రోల్, డీజిల్ ఇంజిన్ ఆప్షన్లలో లభిస్తుంది. 1.5 లీటర్ నాచురల్లీ యాస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్, 1.5 లీటర్ టర్బోఛార్జ్‌డ్ డైరెక్ట్ ఇంజెక్షన్ పెట్రోల్, 1.5 లీటర్ డీజిల్ ఇంజిన్ ఆప్షన్లు ఇచ్చారు. 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ 6 స్పీడ్ ఆటోమెటిక్, మాన్యువల్ ఆప్షన్‌తో వస్తోంది. ఇది 160 పీఎస్ పవర్‌ను 255 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 1.5 యాస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ కూడా 6 స్పీడ్ మాన్యువల్ అండ్ 7 స్పీడ్ డీసీఏతో వస్తోంది. ఇది 106 పీఎస్ పవర్, 145 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇక టర్బో డీజిల్ ఇంజిన్ 6 స్పీడ్ మాన్యువల్, 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌కు సపోర్ట్ చేస్తుంది. ఇది 118 పీఎస్ పవర్‌ను, మాన్యువల్‌లో 260 ఎన్‌ఎం, ఆటోమెటిక్‌లో 280 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఎలక్ట్రిక్ వెర్షన్ కూడా తేనున్నారు. ఇది మొత్తం ఆరు రంగుల్లో లభిస్తుంది.పనోరమిక్ సన్‌రూఫ్, పవర్డ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్, డ్యూయల్ జోన్ ఆటోమేటిక్ క్లయిమేట్ కంట్రోల్ వంటివి ఉన్నాయి. ఇందులో లెవల్ 2 అడాస్ ప్యాకేజీ ఇచ్చారు. మొత్తం 20 కంటే ఎక్కువ భద్రతాపరమైన ఫీచర్లు ఉన్నాయి. స్టాండర్డ్‌గా ఆరు ఎయిర్‌బ్యాగులు ఉన్నాయి. సీటు బెల్టు, ఎయిర్‌బ్యాగులు మెరుగ్గా పనిచేసేందుకు సీట్‌బెల్ట్ యాంకర్ ప్రీ టెన్షనర్లు అమర్చారు. దీని భద్రతను పరీక్షించేందుకు టాటా సియారాను మరో సియారాతో రియల్ లైఫ్‌లో ఢీకొట్టించారు. ఇది 5 స్టార్ రేటింగ్ మించిన భద్రతను కలిగి ఉంటుందని కంపెనీ పేర్కొంది. డాల్బీ అట్మోస్ సౌండ్ సిస్టమ్, ఇన్‌బిల్ట్ 5జీ కనెక్టివిటీ వంటి ఫీచర్లతో దీన్ని తీసుకొచ్చారు. హ్యుందాయ్ క్రెటా, మారుతీ గ్రాండ్ విటారా, హోండా ఎలివేట్ వంటి మధ్య తరహా స్పోర్ట్ వినియోగ వాహనాలతో పోటీ పడబోతోంది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# వ్యాధులకు కారణం అవుతున్న టీ, బిస్కెట్..

ఉదయం అయ్యిందంటే చాలు ప్రతి ఒక్కరు టీ తాగుతుంటారు. తెల్లవారు జామునే టీ తాగనిదే కొందరికి ఆ రోజే గడవనట్లే అనిపిస్తుంది అంటుంటారు.అంటే అంత ఇష్టంగా టీ తాగుతారు. అయితే టీలో బిస్కెట్ వేసుకోవడం చాలా మందికి ఇష్టం ఉంటుంది. అందుకే చాలా మంది టీలో బిస్కెట్ వేసుకుని తింటూ ఉంటారు. కానీ టీలో బిస్కెట్ తినడం వలన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు ఆరోగ్య నిపుణులు. అవి ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. టీలో బిస్కెట్ వేసుకొని తినడం వలన రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే బిస్కెట్‌లో సోడియం, చక్కెర అధికంగా ఉంటుంది. అందువల్ల టీలో బిస్కెట్స్ తినడం వలన బ్లడ్‌లో షుగర్ లెవల్స్ పెరుగుతాయి. కాబట్టి థైరాయిడ్, మధుమేహం వ్యాధి గ్రస్తులు అస్సలే టీతో పాటు బిస్కెట్ తినకూడదంట. అంతే కాకుండా బిస్కెట్స్ రోజూ తినడం వలన జీర్ణ వ్యవస్థ సరిగా ఉండదంట. ఇది గుండెకు హాని చేయడం, కొలెస్ట్రాలను పెంచుతుంది. అంతే కాకుండా మలబద్ధకం వచ్చే సమస్య ఉంటుంది. అదే విధంగా రోగనిరోధక శక్తి కూడా బలహీనపరుస్తుంది. అందువలన టీతో బిస్కెట్స్ అస్సలు తినకూడదు అంటున్నారు ఆరోగ్య నిపుణులు.




# బెండకాయ వల్ల కలిగే ప్రయోజనాలు

మన వంటింట్లో దొరికే కూరగాయలలో బెండకాయ కూడా ఒకటి. బెండకాయ వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. కొందరు బెండకాయ నువ్వు ఇష్టంగా తింటే మరికొందరు తినడానికి కూడా ఇష్టపడరు. ఇక బెండకాయతో మనం ఎన్నో రకాల రెసిపీలు ట్రై చేస్తూనే ఉంటాం. ఈ బెండకాయలు మనకు సీజన్ తో సంబంధం లేకుండా అన్ని కాలాలలో విరివిగా లభిస్తూ ఉంటాయి. బెండకాయ తింటే మధుమేహం అదుపులో ఉండటంతో పాటు పలు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పోషకాలతో నిండిఉండే బెండ కాయలో ఫైబర్, విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. అంతేకాకుండా ఈ బెండకాయ వల్ల ఇంకా ఎన్నో రకాల అద్భుతమైన ప్రయోజనాలు కూడా ఉన్నాయి. వాటి గురించి తెలిస్తే తినకుండా అసలు ఉండలేరు. బెండకాయలో తక్కువ క్యాలరీలు ఉంటాయి. అలాగే ఫైబర్ అధికంగా ఉంటుంది. బెండకాయలో ఉండే గ్లైసెమిక్ రక్తంలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. బెండకాయలో ఉండే ప్రొటీన్ శరీరానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రొటీన్లు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. తగినంత ప్రొటీన్ తీసుకుంటే అది దీర్ఘకాలం మధుమేహ నియంత్రణకు ఉపకరిస్తుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. బెండకాయ తినడం ద్వారా శరీరంలోని ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గుతుందట. బెండకాయలోని ఫైబర్, పెక్టిన్ ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంతో కీలక పాత్ర పోషిస్తాయి. ఊబకాయంతో బాధపడే వారు తరుచుగా బెండకాయ తింటే మంచిదట. బెండకాయ తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుందట. బెండకాయలో క్యాన్సర్ తగ్గించే ఔషధ గుణాలు ఉంటాయట. బెండకాయలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ కారక ఫ్రీ రాడికల్స్‌కు వ్యతిరేకంగా పనిచేస్తాయి. బెండకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. గర్భంతో ఉన్న మహిళలకు ఫోలిక్ యాసిడ్ చాలా ముఖ్యమైన అంశం, బెండకాయలలో ఉండే ఫోలేట్ తల్లి, బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పలు అధ్యయనాలు వెల్లడయింది. బెండకాయ తింటే జీర్ణక్రియ శక్తి పెరుగుతుంది. బెండకాయ లోని తేమజిగురు వల్ల కొంచం తిన్న వెంటనే కడుపు నిండుతుందట. బెండకయ మూత్రవిసర్జనకారిగా పనిచేస్తుందట.బెండకాయ ఎక్కువగా తినే వ్యక్తులు హైడ్రేటెడ్ గా ఉండటానికి ఉపయోగపడుతుంది.



# పెదాలు నల్లగా మారుతున్నాయా..

చాలామంది యువత ఆరోగ్యం పై, అందంపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తుంటారు. అందులో భాగంగానే తమజుట్టుకు, ముఖం అందంగా కనిపించేందుకు ఆముదం రాసుకుంటుంటారు. అంతే కాదు కొంత మంది ఆ నూనెను ఆహారంలో కూడా చేర్చుకుంటారు. ఈ ఆముదంలో అనేక ఔషధ గుణాలు, పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఒమేగా 6, 9 వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఇందులో ఉంటాయి. విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అంతే కాకుండా యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కూడా ఆముదంలో ఉన్నాయి. ఈ నూనెను ఆహారంలో చేర్చుకోవడం వల్ల రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. అలాగే జీర్ణక్రియను కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ నూనెను రోజూ ముఖానికి రాసుకోవడం వల్ల అలర్జీలు, మొటిమలు, మచ్చలు, మొదలైన సమస్యలు దూరమవుతాయి. మీరు ప్రతిరోజూ మీ పెదవుల పై ఆముదం నూనెను రాసుకుంటే, అది మీ పెదాలను మృదువుగా, గులాబీ రంగులో మార్చడంలో సహాయపడుతుంది. అంతే కాదు ఇంకా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఆముదం రాసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు.. పెదవుల పిగ్మెంటేషన్ పోతుంది. చనిపోయిన చర్మం క్లియర్ అవుతుంది.పెదవుల పొడిబారితనం పోతుంది.పెదవులు సహజంగా తేమగా, హైడ్రేటెడ్ గా ఉంటాయి.పగిలిన పెదాలను వదిలించుకోవాలి.పెదాల నల్లని సమస్య దూరమవుతుంది.క్రమంగా పెదవులు సహజంగా గులాబీ రంగులోకి మారతాయి. పెదవుల పై ఆముదం ఎలా రాయాలి.. పెదాలను సహజంగా గులాబీ రంగులోకి మార్చడానికి మీరు నేరుగా ఆముదం నూనెను అప్లై చేయవచ్చు. దీని కోసం ఒకటి లేదా రెండు చుక్కల ఆముదం తీసుకుని, దానితో మీ పెదాలను మసాజ్ చేయండి. మీరు దీన్ని ప్రతిరోజూ ఉదయం ఇంటి నుండి బయలుదేరే ముందు, రాత్రి పడుకునే ముందు మీ పెదవుల పై రాయాలి. మీకు కావాలంటే మీరు సహజ పదార్థాల సహాయంతో ఇంట్లోనే కాస్టర్ ఆయిల్ లిప్ బామ్‌ను తయారు చేసుకోవచ్చు. దీని కోసం, ముందుగా పాన్‌లో షియా బటర్‌ను కరిగించాలి. ఆపై గ్యాస్‌ను ఆపివేయాలి. అది కరిగిన తర్వాత ఒక చెంచా ఆముదం, తేనె, మీకు నచ్చిన ఏదైనా నూనెను జోడిరచండి. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఈ లిప్ బామ్‌ను తప్పనిసరిగా అప్లై చేయాలి. ఇలా చేయడం ద్వారా పెదవులు అందంగా కనిపిస్తాయని చెబుతారు.





# తమలపాకు తులసి గింజలను కలిపి తింటే ?

మామూలుగా చాలామంది ఈ తమలపాకు తినే అలవాటు ఉంటుంది. ఈ తమలపాకుని పాన్ బీడా, పాన్, ఇంకా కొన్ని కొన్ని పదార్థాల ద్వారా తమలపాకులు తీసుకుంటూ ఉంటారు. తమలపాకును తినడానికి ఇష్టపడేవారు తమలపాకు, జర్దా, సున్నం కలిపి తింటే ఆరోగ్యానికి చాలా హానికరం.అయితే ప్రతి నాణేనికి రెండు వైపులా ఉన్నట్టుగానే తమలపాకు తినడం వల్ల కూడా చాలా ప్రయోజనాలు ఉన్నాయి. తమలపాకు లోని ఆస్ట్రింజెంట్ ఎన్నో అనారోగ్య సమస్యలను తగ్గిస్తుంది. తమలపాకులు, తులసి గింజలను కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయి. తమలపాకులు, తులసి గింజలను కలిపి తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది అనేక విధాలుగా ఇన్ఫెక్షన్లతో పోరాడడంలో సహాయపడుతుంది. తమలపాకులు, తులసి గింజలను కలిపి తీసుకోవడం వల్ల శరీరంలోని అనేక రకాల బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్లతో పోరాడుతుంది. వాతావరణంలో మార్పు కారణంగా శరీరంలో అనేక రకాల సమస్యలు మొదలవుతాయి. ఈ సమస్యలలో జలుబు, దగ్గు కూడా ఒకటి. జలుబు అనేది ఒక సాధారణ అనారోగ్య సమస్య. కానీ కరోనా వైరస్ తర్వాత ఈ వ్యాధి సాధారణమైనది కాదు. అటువంటి పరిస్థితిలో తమలపాకులు, తులసి గింజలతో కలిపి తింటే చక్కటి ఫలితం ఉంటుంది. ఇది జలుబు, దగ్గు సమస్యను దూరం చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల గొంతు నొప్పి, దృఢత్వం నుండి ఉపశమనం లభిస్తుంది. ఈ తమలపాకుపాటు తులసి గింజలను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ కూడా బలంగా ఉంటుంది. దీంతో పొట్ట సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. తులసి గింజలను తమలపాకులతో కలిపి తీసుకుంటే మలబద్ధకం, గ్యాస్ సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది.

తమలపాకులు, తులసి గింజలు కలిపి తీసుకోవటం వల్ల చిగుళ్ల వాపు, దంతాల పసుపు నుండి కూడా ఉపశమనాన్ని అందిస్తాయి. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు చిగుళ్లలో వాపు, గడ్డలు, రక్తస్రావం నుండి ఉపశమనం కలిగిస్తాయి. చాలా సార్లు నోటి నుండి దుర్వాసన సమస్య ఉంటుంది. ఈ దుర్వాసన చాలాసార్లు బ్రష్ చేసినా, కడిగినా పోదు. అయితే తమలపాకులో తులసి గింజలు వేసి క్రమం తప్పకుండా తీసుకుంటే నోటి దుర్వాసన సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.

# పుచ్చకాయను తెగ తినేస్తున్నారా..

పుచ్చకాయ వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. ఇందులో 90 శాతం నీరు ఉంటుంది. పుచ్చకాయ వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. అంతేకాకుండా వీటివల్ల ఎన్నో రకాల లాభాలు కూడా ఉన్నాయి. అయితే పుచ్చకాయలు మనకు ఎక్కువగా వేసవిలో లభిస్తూ ఉంటాయి. అందుకే వేసవి కాలంలో పుచ్చకాయను ఎక్కువగా తింటూ ఉంటారు. పుచ్చకాయ తినడం వల్ల విటమిన్స్ మినరల్స్ శరీరానికి అందుతాయి. ఇందులో ఉండే పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు డీహైడ్రేషన్ నుంచి కాపాడతాయి. అదేవిధంగా చర్మాన్ని పొడిబారకుండా హైడ్రేట్ గా ఉండేలా చేస్తుంది. అయితే వేసవి కాలంలో పుచ్చకాయ తినడం మంచిది అని చాలామంది తెగ తినేస్తూ ఉంటారు. మరి పుచ్చకాయను ఎక్కువగా తింటే ఏం జరుగుతుంది? వేసవిలో తినడం వల్ల ఇలాంటి ప్రయోజనాలు కలుగుతాయి ఇప్పుడు మనం తెలుసుకుందాం.. వేసవి తాపం నుంచి రక్షించే పండ్లలో పుచ్చకాయ మొదటి స్థానంలో ఉంటుంది. చల్లదనంతో పాటు, తాజాగా తినగలిగే పండు ఇది. ఇందులో చాలా పోషకాలు ఉంటాయి. వీటి విత్తనాలు కూడా చాలా రకాల ప్రయోజనాలను చేకూరుస్తాయి. పుచ్చ గింజలు ఐరన్, పొటాషియం, విటమిన్లతో నిండి ఉంటాయి. పుచ్చపండుతో పాటు గింజలను తినడం వల్ల అనేక రకాలైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. అతిదాహం, చెమట ద్వారా వచ్చే ఖనిజ లవణాల లోపాలను పుచ్చకాయ తగ్గిస్తుంది. జ్వరంతో బాధపడేవారు పుచ్చకాయ రసంలో తేనె కలిపి తీసుకుంటే నీరసం తగ్గి తక్షణ శక్తి పుంజుకుంటారు. మలబద్ధకం ఉన్నవాళ్లు ప్రతిరోజూ తింటే సమస్య తగ్గుతుంది. పెదవుల్లో తేమ తగ్గకుండా కాపాడుతుంది. ఈ పండులో ఉన్న నీటి శాతం వల్ల మూత్రం సరిగ్గా రానివారు, మూత్ర విసర్జనలో మంట ఉన్నవారికి పుచ్చకాయ చక్కని ఔషధంగా పనిచేస్తుంది.



# బీరకాయను అవాయిడ్ చేస్తున్నారా..?



మన వంటింట్లో దొరికే కూరగాయలలో బీరకాయ కూడా ఒకటి. ఈ బీరకాయను ఉపయోగించి ఎన్నో రకాల రెసిపీలు తయారు చేస్తూ ఉంటారు.. అయితే కొందరు బీరకాయను లొట్టలు వేసుకొని తింటే, మరికొందరు అసలు బీరకాయ తినడానికి ఇష్టపడరు.ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది.. కాబట్టి అత్యధిక నీటిశాతం కలిగిన బీరకాయను ఎండాకాలంలో తింటే చాలా మంచిది. మరి కేవలం ఇవి మాత్రమే కాకుండా ఎండాకాలంలో బీరకాయలు తినడం వల్ల ఇంకా ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. బీరకాయ అనేది పోషకాలతో నిండిన కూరగాయ. ఇందులో విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ కె, ఫోలేట్, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలు దాగున్నాయి. ఇవి మన శారీరక, మానసిక ఆరోగ్యానికి చాలా అవసరం. బీరకాయ ముఖ్యంగా తక్కువ కేలరీలు కలిగి ఉండటంతో పాటు శక్తి వనరు. ఇది అధిక మొత్తంలో నీరు, ఫైబర్ కలిగి ఉంటుంది. ఇది ఆహారాన్ని నిల్వ చేయడంలో సహాయపడుతుంది. ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. అందువల్ల, బీరకాయ కూరగాయ బరువు నియంత్రణకు గొప్ప ఎంపికగా పరిగణిస్తారు. బీరకాయలో మంచి మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇది తిన్న తర్వాత, సాధారణంగా గ్యాస్ లేదా అజీర్ణం గురించి ఆందోళన ఉండదు. బీరకాయలో పెద్ద మొత్తంలో పొటాషియం ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి ప్రయోజనకరంగా పరిగణిస్తారు. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. ఇంకా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అలాగే బీరకాయ పేగులను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. బీరకాయ పేగులను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడే అనేక లక్షణాలు ఉన్నాయి. ఇందులో విటమిన్ ఎ, ఫైబర్ ఉన్నాయి. ఇది పొట్టను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. మరి ఇన్ని ప్రయోజనాలు ఉన్న బీరకాయను అవాయిడ్ చేస్తుంటే వెంటనే తినడం మొదలు పెట్టండి.

# తులసి ఆకులని తింటే న్ని రకాల లాభాలా?



హిందూ సాంప్రదాయంలో తులసి మొక్కకు ప్రత్యేక స్థానం ఉంది. తులసి మొక్కలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. తులసి మొక్క మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. తులసిలో కాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్, మెగ్నీషియం, సోడియం, ఆస్కార్బిక్ ఆమ్లం, కార్బోహైడ్రేట్స్ ఉన్నాయి. వీటి వల్ల రక్త వృద్ధి, గుండెకు బలం, ఎముకలు గట్టితనం, గుండెపోటు రాకుండా గాయాలు మానేందుకు చర్మ సౌందర్యానికి అవయవాల పెరుగుదలకి ,గోర్లు ఆరోగ్యంగా ఉండేందుకు ఈ తులసి ఆకులు ఉపయోగపడతాయి. అందుకే వైద్యులు తరచుగా తులసి కషాయం తులసి ఆకులను తీసుకోవాలని చెబుతూ ఉంటారు. అయితే మరి పరగడుపున ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి ఆకులను తింటే ఏం జరుగుతుందో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. ఉదయాన్నే తులసి ఆకులను నమలడం వల్ల అధిక కొలెస్ట్రాల్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎందుకంటే ఈ రోజుల్లో కొలెస్ట్రాల్‌తో బాధపడేవారు చాలా మంది ఉన్నారు. శరీరంలో కొలెస్ట్రాల్ పెరిగిపోతే ప్రమాదం ఉంటుంది. అలాగే ఈ రోజుల్లో మధుమేహంతో బాధపడేవారు చాలా మంది ఉన్నారు. మధుమేహం ఉన్నవారికి కొలెస్ట్రాల్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి అంటే వారు ఉదయాన్నే తులసి ఆకులను నమలడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. ఇది డయాబెటిస్ వారికి ఎంతో మేలు చేస్తుంది. ఇక నోటి దుర్వాసనతో బాధపడేవారు తులసి ఆకులు ఎంతగానో మేలు చేస్తాయి. నోటి దుర్వాసన, చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి నోటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి ఆకులను తినడం వల్ల రోగ నిరోధ శక్తి పెరుగుతుంది. దీంతో మీరు అనేక తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, వ్యాధుల బారిన పడకుండా నివారించవచ్చు. అంతేకాకుండా మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుంది. తులసి ఆకులను నమలడం వల్ల మూత్రపిండాల పనితీరు సైతం మెరుగు పడుతుంది. కిడ్నీ సంబంధిత సమస్యల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. అలాగే రక్తం శుద్ధి అవుతుంది. ఇది మొటిమలు, మొటిమల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.